## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నందున బుధవారం నల్లగొండ పట్టణంలోని వివిధ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ డి.శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గొల్లగూడ, పెద్దబండ, అవుట్ డోర్ స్టేడియం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### పెండింగ్ చలాన్లు చెల్లించండి

చిట్యాల: వివిధ రకాల వాహనాలపై పెండింగ్‌లో ఉన్న చలాన్లను చెల్లించేందుకు ప్రభుత్వం ప్రకటించిన డిస్కౌంట్‌ను వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని చిట్యాల ఎస్‌ఐ ఇరుగు రవి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ లోపు డిస్కౌంట్‌తో చలానా చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. బైక్, స్కూటీ, ఆటోలకు 80 శాతం డిస్కౌంట్, ఫోర్ వీలర్స్ 60 శాతం డిస్కౌంట్, ఆర్టీసీ బస్సులకు, తోపుడు బండ్లకు 90 శాతం డిస్కౌంట్‌లతో చలాన్లను చెల్లించుకోవచ్చని అన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక


కోక చంద్రశేఖర్, అధ్యక్షుడు

శాలిగౌరారం: ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గురుజాల గ్రామానికి చెందిన కోక చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షులుగా తాళ్ళూరి వెంకన్న, రంగు వీరయ్య, యాదగిరి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడుగా మాదగోని వెంకట్(తుడిమిడి), ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి రమేశ్(శాలిగౌరారం), సహాయ కార్యదర్శిగా బుషిగంపల శ్రీను (ఊట్కూరు), కోశాధికారిగా బట్ట లక్ష్మణ్(శాలిగౌరారం)తో పాటూ కార్యవర్గసభ్యులుగా జినుక మధు, చిల్లంశెట్టి నాగార్జున్, వేముల శివశంకర్, మేడిపల్లి శేఖర్, మర్రి వెంకన్నలు ఎన్నికయ్యారు.

### బెల్టు దుకాణాలపై దాడులు

మర్రిగూడ: మండల పరిధిలోని శివన్నగూడలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపై మంగళవారం మర్రిగూడ పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన బూతం జంగమ్మ వద్ద 60 క్వాటర్ మద్యం సీసాలతోపాటు రెండు ఫుల్ బాటిళ్లు లభించినట్లు ఎస్‌ఐ కె.రంగారెడ్డి తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బెల్టుషాపుల నిర్వాహకులు స్వచ్ఛందంగా తమ షాపులను మూసివేయాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్‌ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, సిబ్బంది నీలకంఠం శ్రీనివాస్, సైదులు, వాహిద్‌పాషా, రమేష్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు ప్రజాపాలన సన్నాహక సమావేశం

నకిరేకల్ : ప్రజాపాలన నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నకిరేకల్‌లోని శ్రీనివాసా ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు స్థానిక మున్సిపల్ కమిషనర్ బాలాజీ తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరవుతారని, నియోజకవర్గంలో అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

### మంత్రుల సమక్షంలో సర్పంచ్ జన్మదిన వేడుకలు


రాంబాబుతో కేక్ కట్ చేయిస్తున్న మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, ఉత్తమ్

కనగల్: మండల పరిధిలోని తేలకంటిగూడెం సర్పంచ్ బొగరి రాంబాబు జన్మదిన వేడుకలు గురువారం నల్లగొండ పట్టణంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో నిర్వహించారు. కోమటిరెడ్డి ప్రత్యేకంగా రాంబాబును పిలిపించుకుని కేక్ కట్ చేయించారు. అనంతరం రాంబాబుకు మంత్రులు, ఎమ్మెల్యేలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముగ్గురు మంత్రులు, 9మంది ఎమ్మెల్యేల సమక్షంలో తనను ప్రత్యేకంగా గుర్తించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు.

### దస్తగిరికి నివాళి

కట్టంగూర్: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఆఫీస్ సబార్డినేట్ ఎండీ.దస్తగిరి (90) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఈయన కట్టంగూర్ మండల పరిషత్ కార్యాలయంలో దాదాపు 20 ఏళ్లపాటు ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేశారు. దస్తగిరి మృతదేహాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు, విద్యాసాగర్ రెడ్డి, బెల్లి ఆంజనేయులు, వెంకటయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, కృష్ణ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

# ప్రమాదకరంగా మూలమలుపులు


వనిపాకల శివారులో ధర్మారెడ్డిపల్లి కాల్వపై ఇరుకుగా ఉన్న కల్వర్టు


వనిపాకల శివారులో దారి వెంట ఉన్న మూలమలుపు

- చిట్యాల– వనిపాకల రోడ్డుపై తరచూ ప్రమాదాలు
- ఇరుకు కల్వర్టుతో ఇబ్బందులు
- రోడ్డు విస్తరణ చేయాలని కోరుతున్న ప్రయాణికులు, వాహనదారులు

చిట్యాల: మండల కేంద్రమైన చిట్యాల నుంచి వనిపాకల గ్రామానికి వెళ్లే రోడ్డులో పలుచోట్ల మూలమలుపులు ఉన్నారు. దీంతో వాహనదారులు ప్రయాణికులు ప్రమాదాలబారిన పడుతున్నారు. చిట్యాల నుంచి వనిపాకల గ్రామానికి సుమారు మూడు కిమీ దూరం బీటీ రోడ్డు ఉంటుంది. ఈ రోడ్డుపై వనిపాకలతోపాటు మరో ఐదారు గ్రామాలకు వెళ్లే ప్రజలు నిత్యం భయంలో ప్రయాణం కొనసాగిస్తున్నారు.

**ఇరుకు కల్వర్టు వద్ద ప్రమాదాలు..**

చిట్యాల నుంచి వచ్చే దారిలో వనిపాకల గ్రామ శివారులో ధర్మరెడ్డిపల్లి కాల్వపై కల్వర్టు నిర్మించారు. కాల్వ ఉన్నంత వెడల్పుగా రక్షణ గోడలతో ఈ కల్వర్టు నిర్మించలేదు. అంతేకాకుండా ఇక్కడే మూలమలుపు సైతం ఉంది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రదేశం వద్ద పలు ద్విచక్ర వాహనాలు, కార్లు అదుపుతప్పి కల్వర్టులో పడిపోయాయి.

**సుమారు పది వరకు మూలమలుపులు**

చిట్యాల నుంచి వనిపాకల గ్రామం వరకు వెళ్లే దారిలో సుమారు పది వరకు ప్రమాదకరమైన మూలమలుపులు ఉన్నాయి. సింగిల్ బీటీ రోడ్డు కావడంతో ఈ దారిలో మూలమలుపులున్న చోట ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ మూలమలుపులున్న చోట ఇప్పటివరకు వందలాది ప్రమాదాలు జరగగా ఎంతోమంది గాయాలపాలయ్యారు.

**కంపచెట్లతో మూసుకుపోతున్న దారి**

ఇరుకు కల్వర్టు, మూలమలుపులతో పాటు వనిపాకల గ్రామానికి వెళ్లే దారిని కంపచెట్లు కమ్మేయడంతో దారి కనిపించడంలేదు. అంతేకాకుండా చిట్యాల శివారు ప్రారంభం నుంచి వనిపాకలకు వెళ్లే దారిలో ఇరుపక్కల సమాధులు ఉండడంతో దారి ఇరుకుగా మారింది. దీంతో రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి చిట్యాల వనిపాకల రోడ్డు వెంట కంప చెట్లు తొలగించి మూలమలుపులు లేకుండా చేయాలని, డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని, ఆయా గ్రామాల ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

**మూలమలుపులను తొలగించాలి**



చిట్యాల నుంచి వనిపాకల గ్రామానికి గల రోడ్డులో ఉన్న ప్రమాదకర మూలమలుపులను తొలగించాలి. చిట్యాల శివారులో సమాధుల వద్ద రోడ్డును విస్తరించాలి. ధర్మారెడ్డిపల్లి కాల్వపై ఇరుకు కల్వర్టును విస్తరించాలి. ఇందుకు అవసరమైన నిధులను అధికారులు, ప్రజాప్రతినిధులు కేటాయించాలి.

–మేడి సంతోష్‌కుమార్, వనిపాకల

# వైభవంగా మాస కల్యాణం


నకిరేకల్ : కల్యాణ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి : మండలంలోని గోపలాయపల్లి గ్రామ సమీపాన గల శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా మాస కల్యాణాన్ని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యేను ఆలయ చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గోసుల భద్రాచలం, దూదిమెట్ల స్రవంతి, కొండయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, సట్టు సత్తయ్య, దార యాదయ్య, పుల్లెంల అచ్చాలు, ప్రజ్ఞాపురం సత్యనారాయణ, రాధారపు భిక్షపతి, విజయలక్ష్మి, గోసుల సుజాత, సాగర్ల సైదులు, సామ కొండల్‌రెడ్డి, యానాల రాంరెడ్డి, రేగట్టె నర్సిరెడ్డి, నర్సింహ తదితరులు ఉన్నారు.

**చెర్వుగట్టులో ఘనంగా మాస కల్యాణం**

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతి జడల రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా మాస కల్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సురేష్‌శర్మ, సతీష్‌శర్మ, అర్చక బృందం ఆధ్వర్యంలో వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**శ్రీకృష్ణ కల్యాణం**

నకిరేకల్ : పట్టణంలోని గీతా మందిరంలో మంగళవారం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుడి కల్యాణ మహోత్సం వైభవంగా జరిగింది. వేడుకల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మందిర నిర్వాహకులు ఉప్పల రమేష్, కందాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎరుకలకు ప్రాధాన్యం ఇవ్వాలి

శాలిగౌరారం: రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎరుకల కులస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని టీపీవైఎస్(తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం) మండల అధ్యక్షుడు మేడె గోవర్ధన్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన శాలిగౌరాం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎరుకల సామాజిక వర్గానికి సరైన గుర్తింపులేక అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురవుతున్నామన్నారు. రాష్ట్రంలోని గత ప్రభుత్వాలు తమను పట్టించుకోలేదని, ప్రస్తుతం రాష్ట్రంలో అధికారం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమకు అవకాశాలు కల్పించి మేలు చేయాలని కోరారు. ఎరుకుల కులస్తులు రాజకీయంగా చైతన్య వంతులు కాలని సూచించారు. ఆయన వెంట ఆ సంఘం మండల ప్రతినిధులు ఉన్నారు.

# కాంగ్రెస్ వైపు బీఆర్‌ఎస్ నేతల చూపు

- అనుచరగణంతో చేరేందుకు సిద్ధమవుతున్న నాయకులు, ప్రజాప్రతినిధులు
- వ్యతిరేకిస్తున్న స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



శాలిగౌరారం : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారం చేపట్టడంతో మండలంలోని పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు బీఆర్‌ఎస్ పార్టీలో సుదీర్ఘ కాలంగా పనిచేసిన పలువురు మండలస్థాయి నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీలో పనిచేసి రాజకీయ, వ్యక్తిగత కారణాలతో బీఆర్‌ఎస్‌పార్టీలో చేరి వివిధ హోదాల్లో పనిచేసినవారే తిరిగి కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి ప్రజాప్రతినిధులతోపాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నట్లు సమాచారం.

**ఎన్నికల ముందు కాంగ్రెస్ గూటికి..**

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు జెడ్పీటీసీ ఎర్ర రణీల, వల్లాల ఎంపీటీసీ మాదగోని కవిత, సర్పంచ్ షేక్ ఇంతియాజ్‌లు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల అనంతరం సింగిల్‌విండో వైస్ చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు.

అదేవిధంగా మరికొందరు శాలిగౌరారం మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నేతలు స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు మార్గం సుగమం చేసుకున్నట్లు తెలుస్తుంది. కాగా కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసిన బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరడాన్ని కొందరు కాంగ్రెస్ నేతలు వ్యతిరేకిస్తున్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చేరికల పరిస్థితిని ఎమ్మెల్యే, మంత్రుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సమాచారం.

# ఘనంగా సీపీఐ ఆవిర్భావ వేడుకలు


చిట్యాల : జెండా ఎగురవేస్తున్న సీపీఐ మండల కార్యదర్శి అక్బర్


నార్కట్‌పల్లిలో..


చండూరు : మాట్లాడుతున్న రామలింగయ్య


మర్రిగూడలో జెండా ఆవిష్కరిస్తున్న ఈదుల భిక్షంరెడ్డి

చిట్యాల: సీపీఐ 99వ ఆవిర్భావ వేడుకలు మంగళవారం చిట్యాల మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్యాలలో పార్టీ జెండాను మండల కార్యదర్శి ఎండీ.అక్బర్, శివనేనిగూడెంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు లింగయ్య ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్, గీతా పనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులుగౌడ్, పార్టీ మండల సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, చిట్యాల పట్టణ కార్యదర్శి ఎస్‌కే.షరీఫ్, మేకల భిక్షం, బొల్గూరు లింగయ్య, దేశగాని బాలరాజు, గుండాల సత్తయ్య, రావుల చిన్న వెంకన్న, దామనూరి అంజయ్య, దేవయ్య, లింగస్వామి పాల్గొన్నారు.

**నార్కట్‌పల్లి మండలంలో..**

నార్కట్‌పల్లి: సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నార్కట్‌పల్లి మండల కేంద్రంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్ జెండా ఎగురవేశారు. మండల కార్యదర్శి పెండ్యాల శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎండీ అక్బర్, ఆలకుంట నరసింహ, వెంపటి శ్రీను, వంగాల నాగయ్య, యోగేందర్‌రెడ్డి, వెంకటయ్య, శ్రీపతిస్వామి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

**చండూరులో..**

చండూరు : పేద ప్రజలకు భారత కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య అన్నారు. మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చండూరు మండల కేంద్రంలో పార్టీ పతాకాన్ని ఆయన ఎగురవేసి మాట్లాడారు. సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్ కుమార్, మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, తిప్పర్తి రాములు, బరిగెల వెంకటేష్, దోటి వెంకన్న, జెల్లా శ్రీను, గంటా రమేష్, ఉషయ్య, నరసింహ, వెంకట్ రెడ్డి, కరీం, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

**మర్రిగూడ మండలంలో..**

మర్రిగూడ: మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద మంగళవారం సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి, పార్టీ నాయకులు బూడిద సురేష్, కల్లెం యాదగిరిరెడ్డి, ఎరుకల నిరంజన్‌గౌడ్, చల్లం పాండురంగారావు, ఆకుల రఘుమయ్య, సల్వోజు రామలింగాచారి, ఇస్కిల్ల మహేందర్, అబ్బనగోని కృష్ణయ్య, కొన్రెడ్డి గిరి, అంజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో పడిపూజ మహోత్సవం


నకిరేకల్ : పూజలో పాల్గొన్న భక్తులు


నల్లగొండ టౌన్: అన్నదానం చేస్తున్న స్వాములు

నల్లగొండటౌన్: పట్టణంలోని సాగర్ రోడ్డులో గల నీలగిరి ధర్మశాస్త్ర దేవస్థానంలో మంగళవారం అయ్యప్ప మండల పడిపూజ, మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భజనలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ చిన్నాల అలివేలు జానయ్య, సింగం వెంకన్న, కంజర శ్రీను, పెన్నా సుబ్రమణ్యగురుస్వామి, కిరణ్, శ్రీహరి, భిక్షపతి, మదన్, పాల్గొన్నారు.

**శ్రీ ఐశ్వర్యసాయి మందిరంలో..**

నకిరేకల్ : పట్టణంలోని శ్రీ ఐశ్వర్యసాయి మందిరంలో శ్రీ దత్తాత్రేయ జయంతి ఉత్సవాలు, సాయి స్వాముల మండల పూజ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయినాథుడికి, దత్తాత్రేయ స్వామికి మహన్యాస పూర్వక అభిషేకాలు వైభవంగా జరిగాయి. ఈవేడుకల్లో ఆలయ ట్రస్ట్ ప్రతినిధులు పోతులు రాములు, యాట మధుసూదన్‌రెడ్డి, వనమా వెంకటేశ్వర్లు, బొల్లం సత్తయ్య, ముప్పారం శ్రీనివాస్, బండారు వేణుగోపాల్, గోలి మంజు, లోకసాని అనిత, టీ.శ్రీనివాస్, బ్రహ్మదేవర వేణు, కూరెళ్ల శ్రీనివాస్, దేవరశెట్టి మధు, వెంకటరమణ, శోభారాణి, జోగ్రిగల శ్రీనివాస్, రామచొక్కం, శ్రీధర్ పాల్గొన్నారు.

# మద్యపాన నిషేధం అమలుకు తీర్మానం


తీర్మాన కాపీని చూపిస్తున్న సర్పంచ్ ఇడెం రోజా

చండూరు(గట్టుప్పల్) : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పిలుపుమేరకు గట్టుప్పల్ మండల కేంద్రంలో మద్యపాన నిషేధం అమలుకు అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకున్నామని సర్పంచ్ కుమారి ఇడెం రోజా తెలిపారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. బెల్ట్ షాపుల రద్దు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. అన్ని పార్టీల ప్రతినిధులు ఏకగ్రీవంగా సహకరిస్తామని తెలిపినందుకు ధన్యవాదాలు తెలిపారు. బెల్ట్ షాప్‌ల యజమానులకు నోటీసులు అందజేస్తున్నామని తెలిపారు. గట్టుప్పల్ మండల కేంద్రంలో బెల్ట్ షాపులు మూసివేయాలని నిర్వాహకులను కోరారు. అదేవిధంగా బుధవారం సాయంత్రం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. ర్యాలీలో అన్ని పార్టీల ప్రతినిధులు, మహిళలు, యువజన సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

శాలిగౌరారం: కట్టంగూరు, శాలిగౌరారం మండలాల విద్యార్థుల ప్రయోజనం కోసం నల్లగొండ–గురుజాల వయా కురుమర్తి, ఆకారం బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని యూత్ కాంగ్రెస్ మండల నాయకుడు జవాజి నాగరాజు ఆర్టీసీ అధికారులను కోరారు. మంగళవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. బస్సు సర్వీసులను అర్ధాంతరంగా నిలిపివేయడంతో జిల్లా కేంద్రంలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసించే శాలిగౌరారం, కట్టంగూరు మండలాలకు చెందిన పలు గ్రామాల విద్యార్థులు చదువు మధ్యలో మానేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు.

# శిథిలావస్థలో ప్రభుత్వ అతిథి గృహం


శిథిలావస్థకు చేరుకున్న అతిథి గృహం

మునుగోడు: నియోజకవర్గ కేంద్రం కావడంతో మునుగోడుకు నిత్యం పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తుంటారు. అయితే వారు కాసేపు విశ్రాంతి తీసుకోవడంతోపాటు మధ్యాహ్న సమయంలో భోజనాలు చేసేందుకు 32 ఏళ్ల క్రితం బస్టాండ్ ఎదురుగా పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని నిర్మించారు. దానిని కొన్నేళ్లపాటు వినియోగించారు. భవనం కొంత మరమ్మతులకు గురికావడంతో ఎనిమిదేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్సీ దివంగత పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయించారు. ఆ తరువాత అందులో కొంతభాగం ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ కార్యాలయానికి వినియోగించగా కొన్ని గదులను అతిథిల కోసం ఉంచారు. తర్వాత డివిజన్ కార్యాలయాన్ని మరో చోటుకు మార్చడంతో దానిని పట్టించుకునే వారు లేకుండా పోయారు. పర్యవేక్షణ లేకపోవడంతో ఆ భవనం భూత్‌బంగ్లా వలె తయారయింది. సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకుంటున్న భవనానికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి వచ్చేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

## నిరుపయోగంగా నీటితొట్లు


కొప్పోలులో కంపచెట్లలో నీటితొట్టి

కేతేపల్లి: మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ఉపాధిహామీ పథకం కింద మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు నిరుపయోగంగా మారాయి. పశువులు, జీవాల దాహార్తి తీర్చడం కోసం గ్రామాల్లో వ్యవసాయ భూముల వద్దకు వెళ్లే దారుల వెంట లక్షల రూపాయలు వెచ్చించి నీటితొట్లు నిర్మించారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం మూలంగా తొట్లను నీటితో నింపే చర్యలు చేపట్టడం లేదు. పలుచోట్ల నీటితొట్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో ఏడాదిలోనే శిథిలావస్థకు చేరాయి. అధికారులు, పాలకులు స్పందించి నీటితొట్లకు నీటి సరఫరా చేసి మూగజీవాల దాహార్తి తీర్చాలని రైతులు కోరుతున్నారు.


ఉప్పలపహాడ్‌లో..

# ఈకేవైసీ కోసం వినియోగదారుల బారులు


మునుగోడులోని ఓ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద భారీగా క్యూ కట్టిన వినియోగదారులు

మునుగోడు: వంట గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారులు ఈకేవైసీ చేయించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వపరంగా ఎలాంటి ఉత్తర్వులు లేకపోయినప్పటికీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సంబంధిత కంపెనీ యాజమాన్యం సూచన మేరకు ఈకేవైసీ నమోదు చేసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం త్వరలో అందించనున్న రూ.500 వంట గ్యాస్‌కు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలనే పుకార్లు రావడంతో కనెక్షన్ కలిగిన ప్రతి ఒక్కరు గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరైతే ఆధార్ కార్డుతో తెల్లవారుజామునే వచ్చి క్యూ కడుతున్నారు. కానీ ఏజెన్సీ నిర్వాహకులు రోజుకు 50 మందికి మించి నమోదు చేయలేకపోవడంతో మిగిలిన వినియోగదారులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు.

**రీఫిల్ సమయంలో ఈ కేవైసీ చేసుకోవాలి**

ఎవరైతే గ్యాస్ సిలిండర్ రీఫిల్ చేసుకునేందుకు వస్తారో వారి నుంచి ఈకేవైసీ తీసుకోవాలని గ్యాస్ కంపెనీల యాజమాన్యం 15 రోజుల క్రితం సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులకు ఓ ఫార్మట్ పంపారు. అలా కాకుండా కనెక్షన్ పొందిన ప్రతి ఒక్కరు ఈ కేవైసీ కోసం ఏజెన్సీ కార్యాలయాల వద్ద బారులుదీరుతున్నారు. ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని, ఇప్పటికిప్పుడు ఈ కేవైసీ చేసుకోవాల్సిన అవసరం లేదని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

**కమ్ముకున్న పొగమంచు**



శాలిగౌరారం మండల వ్యాప్తంగా మంగళవారం ఉదయం పొగమంచు కమ్మేసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు మంచుతెరలు తొలగిపోలేదు. రోడ్లు పూర్తిగా మంచు దుప్పట్లో ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

-శాలిగౌరారం